రేపు ఉద్యోగ మేళా

రంగారెడ్డిజిల్లా ఉపాధి కల్పన కార్యాలయ అధికారి జయశ్రీ

షాబాద్, అక్టోబర్ 23: రంగారెడ్డి జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 25న ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయ అధికారి జయశ్రీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్‌లోని కళాసిగూడ, ప్యారడైస్ సర్కిల్ సమీపంలో చంద్రలోక్ కాంప్లెక్స్ 4వ అంతస్తులో ఉన్న స్టాఫింగ్ టైటాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో శుక్రవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో రిటైల్, ఈకామర్స్, బీపీఓ రంగాల్లో పోస్టులు ఉన్నాయని తెలిపారు. విద్యార్హత 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా పూర్తి చేసి ఉండాలన్నారు. వయస్సు 18-30ఏండ్ల లోపు ఉండాలని చెప్పారు. మరిన్ని వివరాలకు 9059640088/8977175394 నంబర్లలో సంప్రదించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

- నిరుద్యోగ మహిళలకు ఉపాధి శిక్షణ
- దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం డీఎం శైలకుమారి

మొయినాబాద్, అక్టోబర్ 23: గ్రామీణ ప్రాంతాల్లో ఉండే నిరుద్యోగ మహిళలకు మల్టీపర్పస్ హెల్త్ వర్కర్‌పై శిక్షణ ఇస్తామని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం డీఎం శైలకుమారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిధిలోని చిలుకూరులో ఉన్న దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో రెండేండ్ల పాటు గ్రామీణ నిరుద్యోగ మహిళలకు ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ మహిళలు పది, ఇంటర్ వరకు చదివి నిరుద్యోగులుగా ఉన్న వారికి శిక్షణతో పాటు భోజన సౌకర్యం, వసతి కల్పిస్తామన్నారు. ఇందుకోసం ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుతో పాటు పదో తరగతి మెమో, ఇంటర్ మెమో, బోనఫైడ్, కుల, స్థానిక ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలు జతపర్చాలని ఆమె తెలిపారు. https//chfw.telangana.gov.in/anm appdo నందు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 25లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఇస్తున్న ఉచిత శిక్షణా అవకాశాన్ని గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ మహిళలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్
- అటవీ, రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, అక్టోబర్ 23 : అటవీ, రెవెన్యూ భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. బుధవారం వికారాబాద్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో ఆయా శాఖ అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అటవీ, రెవెన్యూ రికార్డుల ప్రకారం భూసమస్యలను పరిశీలించి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ భూములకు సంబంధించి అధికారులు సమన్వయంతో సర్వే చేసి నివేదిక ఇవ్వాలన్నారు. మండలాల వారీగా విచారణ చేపట్టాలన్నారు. పూర్తిస్థాయిలో సర్వే చేసి రిపోర్టు ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం మండలాలవారీగా వివరాలు అడిగి తెలుసుకొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లింగ్యా నాయక్, సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్, ఏడీ సర్వే ల్యాండ్ అధికారి రాంరెడ్డి , ఆర్‌డీవో వా సుచంద్ర, ఫారెస్ట్ రేంజ్ అధికారులు, తహసీల్దార్ పాల్గొన్నారు.

పేహెచ్‌సీల్లో వసతులు కల్పించాలి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు సౌకర్యవంతంగా సేవలు అందించేందుకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. వికారాబాద్ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లాలోని ఎంపీడీవోలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. పీహెచ్‌సీల్లో స్లాబ్‌పై నీరు నిలవడం, లీకేజీ కావడం, పగుళ్లు, విద్యుత్‌కు సంబంధించి తదితర మరమ్మతుల కోసం వెంటనే ఎస్టిమేషన్ పంపించాలని ఆదేశించారు. రోగులకు కావాల్సిన వీల్‌చైర్స్, కుర్చీలు, ఇతర ఫర్నిచర్ తదితర వివరాలు తెలియజేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పల్వన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

పోలీసులు అంకితభావంతో పనిచేయాలి

బంట్వారం, అక్టోబర్ 23: పోలీసులు విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా అంకితభావంతో పని చేయాలని వికారాబాద్ ఎస్పీ నారాయణ రెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సేవలో పోలీసులు మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఫిర్యాదుదారులు సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చిన సమయంలో సానుకూలంగా స్పందించి సేవలు అందించాలన్నారు. అలాగే రికార్డులను సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, ధారూరు సీఐ రఘురాములు, స్థానిక ఎస్సై మహిపాల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసన రచన పోటీలు

వికారాబాద్: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లాలోని పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని పాఠశాలలో విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా వ్యాసరచన పోటీలు నిర్వహించాలని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో నిర్వహించే ఈ పోటీల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. విద్యార్థులు రాసిన వ్యాసాలను ఈ నెల 28లోపు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఆన్‌లైన్‌లో https://forms.gle/iNv6Y5mSJjW8W1Uj7 ఈ వెబ్ సైట్ ద్వారా వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. విచక్షణతో కూడిన మొబైల్ వాడకంపై ఇంటర్ విద్యార్థులకు, తెలంగాణను డ్రగ్‌రహిత రాష్ట్రంలో తీర్చిదిద్దడంలో నా పాత్ర అంశంపై డిగ్రీ ఆపై విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతిభావంతులకు బహుమతులు అందజేస్తామన్నారు. వీరిలో ముగ్గురు అభ్యర్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కొనసాగుతున్న గ్రూప్-1 పరీక్షలు

- మూడు కేంద్రాల్లో 1242 మంది గైర్హాజర్
- పర్యవేక్షించిన అధికారులు

మొయినాబాద్‌లోని కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ గౌతంకుమార్

మొయినాబాద్, అక్టోబర్ 23: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల నుంచి జరుగుతున్న గ్రూప్-1 పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. బుధవారం అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు హాజరయ్యారు. పోలీసులు ఆయా కేంద్రాల వద్ద భారీ బందోబస్తు నిర్వహించారు. మొయినాబాద్ మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 1200 మందికి 717 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 483 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు. హిమాయత్‌నగర్ రెవెన్యూలోని విద్యాజ్యోతి ఇంజినీరింగ్ కళాశాలలో 984 మంది అభ్యర్థులకు 590 మంది పరీక్షలు రాశారు. 394 మంది హాజరు కాలేదు. అమ్డాపూర్ చౌరస్తాలో ఉన్న జోగిన్‌పల్లి భాస్కర ఇంజినీరింగ్ కళాశాలలో 816 మంది అభ్యర్థులకు 451 మంది హాజరు కాగా 365 మంది గైర్హాజరయ్యారు. కేజీరెడ్డి కళాశాల, జోగిన్‌పల్లి భాస్కర ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను మొయినాబాద్ తహసీల్దార్ గౌతంకుమార్ పర్యవేక్షించారు. విద్యాజ్యోతి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసి పరీక్షా కేంద్రాన్ని చేవెళ్ల తహసీల్దార్ కృష్ణ పర్యవేక్షించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాటు చేసినబందోబస్తును మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షించారు.

విద్యుత్ లైన్ అలైన్‌మెంట్‌ను మార్చాలి

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంకకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, రైతులు

కడ్తాల్, అక్టోబర్ 23: మండల కేంద్రం సమీపం నుంచి ఏర్పాటు చేస్తున్న హైటెన్షన్ విద్యుత్ లైన్ అలైన్‌మెంట్‌ను మార్చాలని పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు కోరారు. ఈ మేరకు బుధవారం రంగారెడ్డి కలెక్టర్ శశాంకను కలెక్టరేట్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బీదర్ నుంచి పవర్ గ్రిడ్ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్ కంపెనీ అధారిటీ ఆధ్వర్యంలో బ్లారి నుంచి మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌ఖాన్‌పేట్ వరకు 765 కేవీ హై టెన్షన్ పోల్స్ వేయడానికి సర్వే చేశారని తెలిపారు. కడ్తాల్‌లోని రైతులకు ఎలాంటి సమాచారం లేకుండా పోల్స్ ఏర్పాటుకు సర్వే చేసి మార్కింగ్ వేశారని పేర్కొన్నారు. కడ్తాల్ గ్రామ రెవెన్యూ పరిధిలోని 66 సర్వే నంబర్లలో ఉన్న భూముల్లో దాదాపు 150 మంది రైతులకు చెందిన పొలాల గుండా పోల్స్ ఏర్పాటుకు అలైన్‌మెంట్ రూపొందించారని వివరించారు. పోల్స్ ఏర్పాటుతో అధికంగా నష్టపోయేది చిన్న, సన్న కారు రైతులే అని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోనే మండల శివారు గుండా మూడు భారీ హై టెన్షన్ పోల్ లైన్లు వెళ్లాయని, నాలుగో లైన్ ఏర్పాటు చేస్తే ఎలా అని ప్రశ్నించారు. అధికారులు స్పందించి అలైన్‌మెంట్‌ను మార్చాలని, గ్రామానికి ఐదు కిలోమీటర్ల దూరంలో అగ్రికల్చరల్ జోన్ నుంచి విద్యుత్ లైన్‌ను తీసుకెళ్లాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్‌లు రామకృష్ణ, జంగారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, కాంగ్రెస్ బ్లాక్, మండల అధ్యక్షులు ర్సింహా, బిచ్చానాయక్, రైతులు రాములు యాదవ్, యాదయ్యగౌడ్, గాంధీ, సాయికుమార్, జంగయ్యయాదవ్, మల్లేశ్‌గౌడ్, రాజేశ్, వెంకటేశ్, పెంటారెడ్డి, అంజయ్యయాదవ్, శ్రీనివాస్, మల్లికార్జున్‌రెడ్డి, రవి, మల్లేశ్‌యాదవ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదగా మాట్లాడి సమస్యలు పరిష్కరించండి

రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

నవాబుపేట, అక్టోబర్ 23: కార్యాలయానికి వచ్చే ప్రజలతో రెవెన్యూ సిబ్బంది మర్యాదగా మాట్లాడి వీలైనంత త్వరగా వారి సమస్యలను పరిష్కరించాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. బుధవారం ఆయన తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ధరణి సమస్యలపై గ్రామాల వారీగా ఉన్న దరఖాస్తులను పరిశీలించి, ఇంకా ఏమైనా పెండింగ్‌లో ఉన్నాయా అని తహసీల్దార్‌ను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఆర్‌డీవో వాసుచంద్ర, తహసీల్దార్ జయరాం, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్‌గా ఎమ్మెల్యే

షాద్‌నగర్, అక్టోబర్ 23: రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్‌గా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుల సమక్షంలో బాధ్యతలు స్వీకరించి మొదటి సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పరమైన కార్యక్రమాలను బాధ్యతాయుతంగా నిర్వహిస్తానని ఈ సందర్భంగా తెలిపారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించడంపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబులు సంతోషం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు, కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ మాధవి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు అభినందనలు తెలుపుతున్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

మిషన్ భగీరథ నీటిపై ప్రజల్లో చైతన్యం కల్పించాలి

గ్రామాల మంచినీటి సహాయకుల శిక్షణా కార్యక్రమంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మిషన్ భగీరథ ఎస్ఈ ఆంజనేయులు

పెద్దేముల్, అక్టోబర్ 23 : మిషన్ భగీరథ నీరు స్వచ్ఛమైన, సురక్షితమైన నీరు అని, గ్రామీణ ప్రాంత ప్రజలందరూ ఈ నీటినే తాగేలా గ్రామాల మంచినీటి సహాయకులు అవగాహన కల్పించాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మిషన్ భగీరథ ఎస్ఈ ఆంజనేయులు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో గత 4 రోజులుగా మంచినీటి సహాయకులకు ఇస్తున్న శిక్షణా కార్యక్రమానికి హాజరై పలు సూచనలు, సలహాలను అందించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సురక్షితమైన మంచినీటిని అందించడానికి, మంచినీటి వ్యవస్థను పటిష్టం చేయడానికి ప్రభుత్వం 4 రోజులపాటు శిక్షణను ఏర్పాటు చేసిందన్నారు. అన్ని మండలాల్లో ఈ శిక్షణ కొనసాగుతున్నదన్నారు. సుమారు 300 కి.మీ దూరం నుంచి కృష్ణా జలాలు శ్రీశైలం నుంచి మనకు శుద్ధి చేయబడి 786 గ్రామాలకు 17 మండలాలకు ఈ మిషన్ భగీరథ నీరు అందుతున్నదన్నారు. దాదాపు 135 మిలియన్ లీటర్ల నీటిని శుద్ధి చేసి ప్రజలకు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. శిక్షణలో నేర్చుకున్న అన్ని విషయాలను ఆయా గ్రామాల ప్రజలకు తెలియజేయాలని ఆయన సూచించారు. గ్రామాల మంచినీటి సహాయకులకు హ్యాండ్ పంపు, ఎలక్ట్రికల్ మోటర్ రిపేర్, ప్లంబింగ్ పైప్‌లైన్ లీకేజీ, నీటి నాణ్యత నిఘాలపై 4 రోజులపాటు శిక్షణనిచ్చినట్లు ఆయన చెప్పారు. అనంతరం నీటి సహాయకులకు శిక్షణా సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జర్న ప్ప, ఎంపీవో రతన్‌సింగ్, ఏఈలు, శిక్షణ నిపుణుడు మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పెద్దేముల్ గ్రామ మంచినీటి సహాయకుడు అంబరయ్యకు శిక్షణా సర్టిఫికెట్‌ను అందజేస్తున్న ఎస్ఈ ఆంజనేయులు

బస్సుల సంఖ్యను పెంచాలి

చేవెళ్లలో ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

చేవెళ్లటౌన్, అక్టోబర్ 23: విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలని విద్యార్థులు రోడ్డెక్కారు. ఈ సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో బస్ స్టేషన్ ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠశాలలు, కళాశాల సమయానికి బస్సుల సంఖ్యను పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామాలకు బస్సు సౌకర్యం లేక విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి రోజూ సాయంత్రం చేవెళ్ల బస్ స్టేషన్‌లో బస్సులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు తేజ, సాయి, గణేశ్‌గౌడ్, సమీర్, చందు, పవీన్, సందీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లేట్ల కోసం రోడ్లపైకి..

మర్పల్లిలో రోడ్డుపై తిరుగుతున్న విద్యార్థులు

మర్పల్లి, అక్టోబర్ 23: మర్పల్లి ప్రభుత్వ పాఠశాలలో చదువున్న విద్యార్థులు మధ్యాహ్న భోజన సమయంలో రోడ్డుపై తిరుతుండడంపై స్థానికులు మండిపడుతున్నారు. బుధవారం మధ్యాహ్న భోజనం చేసే సమయంలో విద్యార్థులు సమీప దుకాణాల్లో పేపర్ ప్లేట్లు కొనుగోలు చేసి రోడ్డుపై తిరుగుతున్నారు. ఉపాధ్యాయుల పర్యవేక్షణ లోపంతోనే ఇలా జరుగుతున్నదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల సమయంలో ఇలా రోడ్డుపై తిరిగితే ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి పాఠశాలలో ప్లేట్లు ఏర్పాటు చేసేలా చూడాలని కోరుతున్నారు.

ఎంబీఏ పరీక్ష జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 23: ఓయూ పరిధిలోని ఎంబీఏ పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1,000 చొప్పున చెల్లించి వచ్చే నెల 4వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

వివిధ కోర్సుల పరీక్ష ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 23: ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ లాంగ్వేజెస్, మూడేళ్ల ఎల్ఎల్బీ, మూడేళ్ల ఎల్ఎల్బీ ఆనర్స్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్ఎల్బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్బీ తదితర కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్టు పేర్కొన్నారు.

భాస్కర దవాఖానకు మృతదేహం అప్పగింత

సునీల్‌కుమార్ మృతదేహాన్ని భాస్కర దవాఖాన వైద్యులకు అప్పగిస్తున్న కుటుంబసభ్యులు

మొయినాబాద్, అక్టోబర్ 23 : హైదరాబాద్‌లోని బోరబండ ప్రాంతానికి చెందిన డీఆర్ సునీల్‌కుమార్ 12 ఏండ్ల క్రితం మొయినాబాద్ మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో స్థిరపడ్డాడు. విద్యార్థుల కోసం సొంత నిధులతో గ్రంథాలయం ఏర్పాటు చేశాడు. చుట్టుపక్కల గ్రామాల్లో కొన్ని సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించే వాడు. తను బతికి ఉన్నప్పుడే తన దేహం కూడా సమాజానికి ఉపయోగపడాలని తన మృతదేహాన్ని భాస్కర దవాఖానకు అప్పగించాలని పదేండ్ల క్రితం అంగీకార పత్రాన్ని రాసిచ్చాడు. ఈ క్రమంలో సేవా కార్యక్రమాలు చేయడానికి వచ్చిన ఆయన అనారోగ్యం కారణంగా బుధవారం మృతిచెందాడు. వెంటనే గ్రామస్తులు కుటుంబసభ్యులకు సమాచారమందించారు. ఈమేరకు సునీల్‌కుమార్ రాసిచ్చిన అంగీకార పత్రం ప్రకారం మృతదేహాన్ని భాస్కర దవాఖాన వైద్యులకు అప్పగించారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి

ధారూరు అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారి హేమ

ధారూరు, అక్టోబర్ 23: అటవీ భూమిలో చెట్లను ధ్వంసం చేసి పల్లి పంట సాగు చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని ధారూరు అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారి హేమ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 4న ధారూరు అటవీ శాఖ రేంజ్ పరిధిలోని రాంపూర్ తండా డంపింగ్ యార్డు సమీపంలో ఉన్న సర్వే నంబర్ 95లోని ఎకరా భూమిలో గట్టెపల్లి తండా వాసులు పాత్లావత్ మల్లేశ్, పాత్లావత్ నరేశ్ పంట సాగు చేసుకుంటున్నారని తెలిపారు. గతంలో ఇలా జరిగితే హెచ్చరించామన్నారు. మళ్లీ పంట సాగు చేసుకున్నారని తెలిపారు. ఈ భూమిలో మొక్కలు నాటితే వాటిని ధ్వంసం చేశారని తెలిపారు. వీరిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఆడబిడ్డలను కాపాడుకోవాలి

మానవ అక్రమ రవాణాపై అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ

బడంగ్‌పేట, అక్టోబర్ 23: మానవ అక్రమ రవాణాను అరికట్టాల్సిన బాధ్యత ప్రతిపౌరుడిపై ఉన్నదని సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ బలరామకృష్ణ, సూపర్‌వైజర్ నారాయణమ్మ అన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, జిల్లా శిశు సంక్షేమ శాఖ హయత్‌నగర్ ప్రాజెక్టు సరూర్‌నగర్ కార్యాలయంలో మానవ అక్రమ రవాణాపై అంగన్‌వాడీ టీచర్లకు రెండు రోజులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మనుషుల అక్రమ రవాణాను నిర్మూలించాలంటే ప్రజల భాగస్వామ్యం తప్పని సరిగా ఉండాలన్నారు. అక్రమ రవాణా అనేది ప్రపంచ వ్యాప్తంగా శరవేగంగా విస్తరిస్తున్నదని తెలిపారు. మానవ అక్రమ రవాణాను అడ్డుకుంటేనే ఆడ బిడ్డలకు రక్షణ ఉంటుందన్నారు. యువతులను ఉద్యోగం, ప్రేమ, పెండ్లి, సినిమా పేరుతో మోసం చేస్తున్నారని, ప్రతీ ఒక్క మహిళ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరికైనా ఎలాంటి సమస్య వచ్చినా అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజ్వల ఆధ్వర్యంలో 2600 మంది అమ్మాయిలను కాపాడినట్టు తెలిపారు. ఎక్కడైనా బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు, హత్యాచారాలు జరిగిన్నట్టు తెలిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారమివ్వాలన్నారు. అక్రమ రవాణాపై సమాచారం తెలిస్తే 1098, (చైల్డ్ లైన్), 100(పోలీస్), 181 మహిళా హెల్ప్‌లైన్, 1930 (సైబర్ క్రైమ్) సైబర్ వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేసే అవకాశం ఉన్నదన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గీత, కళ్యాణి, యాదగిరి, ప్రజ్వల ప్రతినిధులు చెన్న కేశవ్, అంగన్‌వాడీ టీచర్లు బిరుదు యశోద, రేణుక, అనంత, సునీత, రజినీ, మహేశ్వరి, పద్మశ్రీ, వరలక్ష్మి, శోభ, శోభలత, ఇందిర, కలమ్మ, మస్రు, యాదమ్మ, గంగా, శ్రీలక్ష్మి, రజినీ, సరళ, రెహాన పాల్గొన్నారు.

బీపీఏ ఓరియంటల్ లాంగ్వేజెస్ పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 23: ఓయూ పరిధిలోని బీఏ ఓరియంటల్ లాంగ్వేజెస్ పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. మెమోలను మూడువారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.500 చొప్పున చెల్లించి ఈ నెల 28వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్